క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నకరికల్లు: ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని పలు దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు చేపట్టారు. గోడౌన్‌లలో స్టాకు, విక్రయాల రిజిస్టర్లు పరిశీలించారు. ఎమ్మార్పీకి అధికంగా రైతుల వద్ద వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యత ప్రమాణాలు కలిగిన మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. కొనుగోలు చేసిన రైతులకు సంతకాలతో కూడిన రశీలు ఇవ్వాలన్నారు. చీమలమర్రి, చల్లగుండ్ల, కండ్లకుంట, దేచవరం, రూపెనగుంట్ల, చాగల్లు గ్రామాల్లోని రైతుసేవ కేంద్రాల్లో యూరియా, ఎంటీపీ ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రచయిత పీసపాటికి ప్రతిభా పురస్కారం



అమరావతి: ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత పీసపాటి నాగేశ్వరశర్మకు ప్రముఖ కవి, ధార్మిక వేత్త ఉమ్మడిసింగు కృష్ణారావు 95వ జయంతి సందర్భంగా ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన మానసార్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయగాన సభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీ త్యాగరాయగాన సభలో వివిధ రంగాల ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఆదర్శ కిరణం పత్రిక సంపాదకుడు వంగల బాలరాజుగౌడ్, కుసుమ ధర్మన్న పీఠం అధ్యక్షురాలు, కవయిత్రి డాక్టర్ రాధా కుసుమ, సభ అధ్యక్షుడు కళా వి.ఎస్. జనార్ధనమూర్తి చేతుల మీదుగా పీసపాటి పురస్కారాన్ని అందుకున్నారు.

ఉపాధి పనులపై సమీక్ష సమావేశం



రాజుపాలెం: పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామాల్లో శంకుస్థాపన చేసిన పనులను త్వరగా ప్రారంభించే విధంగా ఉపాధి సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణ చెప్పారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా ఉపాధి హామీ పథకానికి సంబంధించిన పలు అంశాలను చర్చించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో కలసి ఉపాధి పనులు చేయాలని సూచించారు. పంచాయతీరాజ్ ఏఈ నరసింహారావు, ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శించిన న్యాయమూర్తులు



సత్తెనపల్లి: పట్టణంలోని రఘురామ్‌నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహాన్ని సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ నాగ వెంకట శ్రీనివాసరావు, సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తాషిద్ హుస్సేన్ గురువారం సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. స్వయంగా ఆహార పదార్థాలను రుచి చూసి, నాణ్యతను పరిశీలించారు. ప్యానల్ న్యాయవాది బీఎల్ లక్ష్మీ కోటేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

మాచర్లలో రాష్ట్రస్థాయి మెగా బైబిల్ క్విజ్ పోటీలు

మాచర్ల: పట్టణంలోని నెహ్రూనగర్ సమర్పణ చర్చి ఆవరణలో డిసెంబర్ 14న రాష్ట్రస్థాయి మెగా బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ శంకర్, ప్రోగ్రాం పర్యవేక్షకులు బ్రహ్మనాయుడు తెలిపారు. గురువారం వారు చర్చి ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ బైబిల్ పోటీల వివరాలు తెలిపారు. బైబిల్ గ్రంథంలోని అపోస్తులు, ఫిలిప్పీ పత్రికపై ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ పోటీలకు ముగ్గురు చొప్పున బృందంగా రూ.వంద చెల్లించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 63622 18163, 98663 72314 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రాముఖ్యత 'సంత'రించుకుంది

- క్రోసూరు మార్కెట్ యార్డులో 30 ఏళ్లుగా పశువుల సంత
- 1994లో ఏర్పాటు
- ప్రతి గురువారం జోరుగా క్రయ విక్రయాలు
- యార్డుకు ప్రధాన ఆదాయ వనరు
- రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు సెస్సు వసూలు
- ఇతర రాష్ట్రాల నుంచి రైతుల రాక



క్రోసూరు మార్కెట్‌లో పశువుల క్రయ విక్రయాలు

క్రోసూరు: క్రోసూరు మార్కెట్ యార్డులో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పశువుల సంత నిర్విరామంగా కొనసాగుతోంది. 1994 నుంచి పాడి పశువులు క్రయ విక్రయాలకు ప్రధాన అడ్డాగా మారింది. పూర్వం క్రోసూరులో ప్రైవేట్ పశువుల సంత నిర్వహించేవారు. అప్పట్లో పశువులు క్రయ విక్రయాల్లో అవకతవకలు జరిగేవి. నిజమైన పశువు యజమాని ఎవరనేది తెలిసేది కాదు. కాయిదారులు(దళారులు) పశువులు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న వారి సమాచారం తెలుసుకునేవారు. వారి వద్దకు వెళ్లి పశువులు కొనుగోలు చేసేవారు. క్రోసూరులో ఒక కూడలిలో వాటిని విక్రయించేశారు. వీటిలో దొంగతనంగా తెచ్చిన పశువులను కూడా అమ్మేవారు. దీంతో పశుపోషకులు తీవ్రంగా నష్టపోయేవారు. బాధితులు పోలీసు స్టేషన్లలో, పంచాయతీ సర్పంచ్‌లకు తమ పశువుల పోయాయని ఫిర్యాదులు చేసేవారు. ఫలాన వ్యక్తి వద్ద పోయిన పశువు ఉంది అని తెలిస్తే.. అక్కడికి పోయి రుజువులు, పంచాయతీ సర్పంచ్ లెటర్ తీసుకుని వెళ్లి.. తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రభుత్వ సంత ఏర్పడటంతో సంత పూర్తిగా రూపురేఖలు మారాయి. 95 శాతం దొంగ విక్రయాలు అరికట్టబడ్డాయి.

ఇతర రాష్ట్రాల నుంచి రాక

మార్కెట్ యార్డులో ప్రతి గురువారం జరిగే పశువుల సంతలో పాడి గేదెలు, దున్నలు, ఎడ్లు, ఆవులు, వట్టిపోయిన పశువుల క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. కొనుగోలుదారులు తమిళనాడు (పుల్లాచి), తెలంగాణ, బంగారుపాలెం, నాయుడుపేట, కావలి తదితర ప్రాంతాల నుంచి వచ్చి పశువులు కొంటారు. వీరితో పాటు చుట్టప్రక్కల పశుపోషకులు కూడా వస్తుంటారు.

కరోనా కాలంలో రెండేళ్లు నిలిపివేత

కరోనా సమయంలో 2019, 2020లో పశువుల సంత పూర్తిగా నిలిపివేశారు. అంతేకాక 2023లో ఆవులలో లంపింగ్ స్కిన్(చర్మ) వ్యాధి కనబడటంతో మూడు మాసాల పాటు సంత మూత వేశారు. ఏది ఏమైనప్పటికీ పశువుల క్రయవిక్రయాలకు ప్రధాన అడ్డాగా క్రోసూరు మార్కెట్ యార్డు ప్రాముఖ్యత 'సంత'రించుకుంది.

సంతలో పశువుల కొనుగోళ్లపై ఒక శాతం సెస్సు

మార్కెట్ యార్డు సంత నిర్వహణలో భాగంగా పశువు కొనుగోలు దారుడి నుంచి ఒక శాతం సెస్సు వసూలు చేస్తారు. విక్రయాదారుడి నుంచి ఎలాంటి రుసుం తీసుకోరు. విక్రయించని పశువులకు విక్రయించలేదని రసీదు ఇస్తారు. సంత క్రయ విక్రయాలకు మూడు రిజిస్టర్లు తప్పక నిర్వహిస్తుంటారు. ప్రతి సంతకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు సెస్సు వసూలవుతుంది. మార్కెట్ యార్డుకు ప్రధాన ఆదాయ వనరు పశువుల సంత అని చెప్పవచ్చు. యార్డులో ప్రత్యేక శ్రేణి(గ్రేడ్–1) కార్యదర్శితో పాటు 11 మంది సిబ్బంది పనిచేస్తుంటారు. ప్రభుత్వం పాలక వర్గ కమిటీని ఏర్పాటు చేస్తుంది. వారిలో ఎమ్మెల్యే గౌరవ అధ్యక్షుడిగా ఉంటారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌ల నామినేట్ చేస్తారు. డైరెక్టర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులుతో కలిపి 20 మంది ఉంటారు. పాలకవర్గం లేకుంటే ప్రభుత్వ మార్కెటింగ్ శాఖ ఆధీనంలో యార్డు సెక్రటరీ పాలనలో సంత జరుగుతుంది.

బాధిత పశుపోషకుల కోసం..

దొంగతనానికి గురై పట్టుబడిన పశువులను సంతలో ప్రదర్శనకు ఉంచుతారు. తద్వారా తమ పశువు పోయిందని ఎవరైనా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారు సంతలో పెట్టారని తెలిస్తే తమదో, కాదో వచ్చి చూసుకుంటారు.

యార్డులో మౌలిక వసతులు

సంతలో పశువుల క్రయ విక్రయదారులకు అన్ని రకాలు మౌలిక వసతులు యార్డు కల్పిస్తుంది. పశువులకు మేత, నీళ్ల తొట్లు, రైతులకు తాగునీరు, ప్రైవేట్‌గా కొంతమంది సంతలోనే స్టాల్స్ పెట్టుకుని వివిధ వ్యాపారాలు చేసుకుంటుంటారు.

గొర్రెల మండి ఏర్పాటుకు ప్రయత్నం

పశువుల సంతలో అన్ని సౌకర్యాలు కల్పించాం. విద్యుత్, తాగునీరు ఏర్పాటు చేశాం. అదనంగా పశువుల షెడ్డు ఒకటి ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. గతంలో గొర్రెల మండీ పెట్టినప్పటికీ కొనుగోలుదారులకు అవగాహన కలిగించలేకపోవడంతో ముందుకు సాగలేదు. ఈసారి కొత్తపాలక వర్గం ఏర్పడిన తర్వాత తిరిగి మరిన్ని మార్పులు చేర్పులతో గొర్రెల మండి కూడా ఏర్పాటుకు ప్రయత్నిస్తాం.

– కుంభా ఈశ్వరరావు, కార్యదర్శి, మార్కెట్ యార్డు

ఓటు వేసేందుకు ఎమ్మెల్యే సిద్ధం



దరఖాస్తు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కోరారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఓటు నమోదులో భాగంగా ఫాం–18ను పూర్తి చేసి సమర్పించారు. ఓటు వినియోగించుకోవడం సామాజిక బాధ్యత అని, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకొని, ఓటు వేయాలన్నారు.

బదిలీ.. మిగిలింది ఖాళీ



వెలవెలబోతున్న రాజుపాలెం గ్రామ సచివాలయం

రాజుపాలెం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఉద్యోగుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శులు వేరే గ్రామాలకు బదిలీ అయ్యారు. ఈ పోస్టుల్లో ఇంత వరకు ఎవరూ రాలేదు. ఇన్‌చార్జిలను కూడా నియమించ లేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో రైతులు, విద్యార్థులు, విద్యుత్ వినియోగదారులు, ఆధార్ నమోదుదారులకు సంబంధించిన ఆన్‌లైన్ సర్వీసులను పూర్తిగా నిలిచిపోయాయి. బ్యాంకుల్లో రైతులు రుణాలు తీసుకోవడానికి 1బీ, అడంగుల కోసం, విద్యార్థులు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు సచివాలయం చుట్టూ తిరుగుతున్నారు. డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో నిరాశతో వెనుతిరిగుతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నారు.

వేతనాలు, సెలవులు అమలు చేయాలి

ధర్నా చేసిన మున్సిపల్ కార్మికులు



ధర్నా చేస్తున్న కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులకు స్కిల్లు, సెమిస్కిల్లు, అన్‌స్కిల్డ్ వేతనాలు, వారాంతపు, పండగ సెలవులు ఇవ్వకపోవడం అన్యాయమని, వాటిని వెంటనే అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం, ఇంజనీరింగ్ కార్మికుల మచ్చర్ పాయింట్ వద్ద ధర్నా చేశారు. కార్మికులకు జీతాలతో పాటు ఎనిమిది గంటల పనిదినం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షుడు షేక్ చిన్న అల్లాభక్షు, కార్యదర్శి సోమశేఖర్, కుంచాల శ్రీను, బాలాజీ సింగ్ నాయకత్వం వహించారు.

రిలే దీక్షా శిబిరానికి సంఘీభావం

రాజకీయ కారణాలతో టీడీపీ కూటమి నాయకులు అన్యాయంగా తొలగించిన ఇంజనీరింగ్ విభాగ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం వారు మున్సిపల్ కార్యాలయంకు ఎదురుగా రిలేదీక్షలు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి వారికి తమ సంఘీభావం తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ ఒకేపార్టీలో ఉండాలనే నిబంధన ఏదీ ఉండదన్నారు. ఎవరికి తోచిన పార్టీలో వారు ఉంటారని, వారు తమ పార్టీ వారు కాదనే ఉద్దేశ్యంతో విధుల నుంచి చిరుద్యోగులను తొలగించటం దారుణమని అన్నారు. వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, పౌరహక్కుల సంఘ జిల్లా కార్యదర్శి శికినం చిన్న పాల్గొన్నారు.

బిడ్డా లేవరా.. కాలేజీకి పోదువు



కుమారుడు మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

దాచేపల్లి : ''బిడ్డా లేవరా..కాలేజీకి పోదువు..ఇక నుంచి నేను పొద్దునే కాలేజీకి పంపేందుకు ఎవర్ని లేపాలిరా.. రేయ్ వెంకటేష.. అయ్యా లేవరా.. నా బంగారు కొండ.. మీ అమ్మ పిలుపు నీ చెవిన పడటంలేదా.. నాయనా ఒక్కసారి లేవరా.. అయ్యో భగవంతుడా నా కడుపు కోశావు కదయ్యా'' అంటూ ఆ తల్లి రోదించినన్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురంకి చెందిన తమ్మిశెట్టి కృష్ణంరాజు, శివకుమారి దంపతులకు ముగ్గురు కుమారులు, పెద్దకుమారుడైన వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేష్ డిగ్రీ మూడో సంవత్సరం మాచర్ల ఎస్‌కేబీఆర్ కాలేజీలో చదువుకుంటున్నాడు. క్వారీ పనులు చేసుకుంటు బిడ్డను తల్లిదండ్రులు చదివించుకుంటున్నారు. ఇంటి వద్ద నుంచే వెంకటేష్ కాలేజీకి వెళ్లేవాడు. ప్రతి రోజూ తల్లి వెంకటేశ్‌ని లేపి భోజనం తయారు చేసి కాలేజీకి పంపించేది. డయేరియా బారిన పడిన 12 గంటల వ్యవధిలోనే చేతికి అందివచ్చిన కుమారుడు వెంకటేష్ మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రుల అర్తనాదాలు మిన్నంటాయి. కొడుకు మృతదేహం వద్ద తల్లి రోదించినన్న తీరును చూసి అక్కడున్న వారంతా కన్నీంటిపర్యంతమయ్యారు. తల్లి శివకుమారిని ఓదార్చటం ఎవరి తరమూ కాలేదు. కుమారుడు మృతదేహం వద్ద ఎక్కిఎక్కి ఏడ్చిన శివకుమారి సొమ్మసిల్లిపడిపోయింది. వైద్యసిబ్బంది ఆమెకి వైద్య సేవలు అందించారు. వెంకటేష్ మృతితో అంజనాపురం కాలనీలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటేష్‌తో పాటుగా చదువుకునే తోటి విద్యార్థులు వచ్చి మిత్రుడి మృతదేహాన్ని కడసారి చూసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

బస్టాండ్‌లో విచారణ నంబరు మార్పు

సత్తెనపల్లి: పట్టణంలోని ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండులో విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన ల్యాండ్‌లైన్ ఫోన్ నంబర్ 08641-23255 ఫోన్ తరచూ మరమ్మతులు వస్తున్న నేపథ్యంలో మరో నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ గురువారం తెలిపారు. ఇక నుంచి విచారణకు 73829 90105 ఫోన్ నంబర్ పనిచేస్తుందన్నారు. సత్తెనపల్లి ఏపీఎస్ ఆర్టీసీ సత్తెనపల్లి డిపో సమాచారం నిమిత్తం ఈ నంబరుకు సంప్రదించాలన్నారు.

నేడు ఆధార్ నవీకరణకు గడువు ముగింపు



నకరికల్లు: ఉచితంగా ఆధార్ నవీకరణకు శుక్రవారంతో గడువు ముగుస్తున్నందున శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కేవీ శివప్రసాద్ సూచించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత ఆధార్ నవీకరణ శిబిరాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ శిబిరం శుక్రవారంతో ముగుస్తుందన్నారు. 15 నుంచి 17 ఏళ్ల వయస్సు లోపు వారు బయోమెట్రిక్ అప్డేషన్ చేసుకోవాలని సూచించారు. గురువారం నాటికి గ్రామంలో 76 మంది బయోమెట్రిక్ నవీకరణ చేసుకున్నట్లు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్‌లు శాంతి, సుజన, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మా బజార్ ఉపయోగకరం

మాచర్ల: పట్టణంలోని వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు తమ ఇంటిలో తయారు చేసిన వంటకాలు, వివిధ సామగ్రి, దుస్తులు, ఫ్లవర్ వాజ్‌లతోపాటు అనేక రకాల ఉత్పత్తులతో మెప్మా బజార్ ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ వేణుబాబులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అన్నా క్యాంటీన్ సమీపంలో మెప్మా బజార్‌ను వారు ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు తమ ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించేందుకు బజార్ ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి

జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారిణి నీలావతి

నాదెండ్ల: ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా అదనపు తరగతులు, అంతర్గత పరీక్షల నిర్వహణపై శ్రద్ధ పెట్టాలని పల్నాడు జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారిణి ఎం.నీలావతి చెప్పారు. యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని మొదటి, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగుల సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమీపంలోని గణపవరం సీఆర్ కాలేజీ, చిలకలూరిపేటలోని ఏఎంజీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. స్వంత ఖర్చులతో విద్యార్థినులకు యూనిఫాం అందించిన పీజీటీ టీచర్లను ఆమె అభినందించారు. అనంతరం ఆమెను హెచ్‌ఎం విజయభారతి, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

గుంతలకు శాశ్వత పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులకు గుంత తవ్వుతున్న కార్మికుడు

అమరావతి: ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతి ముఖ ద్వారం అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో మోకాలి లోతు గుంతలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సమస్యపై సాక్షిలో గుంత–ప్రమాదాల చింత శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టారు. మూడు పెద్ద గుంతలు ఏర్పడడానికి భూమిలో పైపులకు లీకులు ఏర్పడటమేనని గుర్తించారు. వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకున్నారు. నెలల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేశారు.

వ్యాక్సినేషన్ కాని పిల్లలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సూపర్‌వైజర్లు

రాజుపాలెం: మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ఇప్పటి వరకు టీకాలు వేయించుకోని ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించాలని డాక్టర్ కేవీ కృష్ణకుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు హెడ్ కౌంట్ సర్వే సెన్సిటైజేషన్ రియోరియంటేషన్ శిక్షణ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ సర్వే ఫాంలు తప్పులు, తడక లేకుండా పూర్తిచేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని పిల్లలను ఖచ్చితంగా గుర్తించాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, ఉషారాణి, సీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

మెడికల్ కళాశాలకు 'పింగళి' పేరు హర్షణీయం



బ్రాహ్మణ సంఘం నాయకులు

సత్తెనపల్లి: రాష్ట్ర క్యాబినేట్ సమావేశంలో ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించాలని, మెడికల్ కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెట్టాలని నిర్ణయించడం హర్షణీయమని సత్తెనపల్లి బ్రాహ్మణ సంఘం నాయకులు అంపిరాయిని రాజశేఖర్ శర్మ, కోనంకి మారుతి అన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ సంఘం నాయకులు మాటేటి హనుమంతురావు, కొడవటికంటి మార్కండేయశర్మ, డి. సత్యంబాబు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మేనేజర్ రవికుమార్, సంస్థ సభ్యులు

సత్తెనపల్లి: బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో పయనించాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు కొమెరపూడి బ్రాంచ్ మేనేజర్ జె.రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొమెరపూడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో అనేక అవకాశాలున్నాయన్నారు. వాటిని గ్రామీణ ప్రాంతాల ఖాతాదారులు ఉపయోగించుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డిఫాల్టర్ గా ఉండకూడదన్నారు. ల్యాంప్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, ల్యాంప్ సంస్థ రీసోర్సు పర్సన్ షేక్ బాజీ మాట్లాడారు. ఆర్బీఐ ద్వారా అందించే రుణాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొమెరపూడి యానిమేటర్లు నూర్జహాన్, మాలీన్, మాధవి, సరిత, హేమలత, కంటిపూడి యానిమేటర్లు సుందరి, శివకుమారి, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ లక్ష్మీప్రసాదు



ఓటరు నమోదు కేంద్రంలో యూటీఎఫ్ నాయకులు



సూచనలిస్తున్న తహసీల్దార్ పుల్లారావు

క్రోసూరు: ఆమంచి విజ్ఞాన భవన్‌లో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఒ.ప్రకాష్‌రావు పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యాలయాన్ని గురువారం ప్రారంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోసూరు, అచ్చంపేట మండలాల పరిధిలోని పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. మండల యూటీఎఫ్ బాధ్యులు బోళ్ల నర్సింహారెడ్డి, కె.లక్ష్మణరావు కె. రామాంజనేయులు, జి.రామకృష్ణ, కేపీవీ సత్యనారాయణ, అచ్చంపేట బాధ్యులు షేక్ బాషా, సీహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్మిక కార్యదర్శి జి. విబాబు, నాయకులు టి.హనుమంతరావు, జి.శివపార్వతి, బి.జయలక్ష్మి, ఆర్.వెంకటేశ్వర్లు కె.గోపీ కృష్ణారెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

నకరికల్లు: ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదుపై పట్టభద్రులకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ కె.పుల్లారావు సూచించారు. ఓటు నమోదుపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.కాశయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టభద్రులకు అవగాహన కల్పించాలి

క్రోసూరు: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల సందర్భంగా ఓటరు నమోదుపై గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు బీఎల్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టభద్రులు ఫాం 18 ద్వారా ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలన్నారు. దరఖాస్తుకు నవంబర్ 6వ తేదీ వరకు గడువుందని చెప్పారు. బీఎల్వోలు ఫాం 18 పై అవగాహన కల్పించి, పట్టభద్రులతో దరఖాస్తు చేయించాలని చెప్పారు. వీర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ముప్పాళ్ల: గ్రామాల్లో పట్టభద్రులను గుర్తించి వారంతా ఓటు హక్కు పొందేలా చూడాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు హక్కుపై బీఎల్వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. 2021 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తైన వారు అర్హులని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. నవంబర్ 6తో గడువు ముగుస్తుందన్నారు. బీఎల్‌ఓలు గ్రామాల్లో అవగాహన కల్పించి, పట్టభద్రులందరూ ఓటు హక్కు పొందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.